సాక్షి సంగారెడ్డి

శనివారం । 1 । ఏప్రిల్ । 2023

బాలుడిపై కుక్కల దాడి

కుక్కల దాడిలో బాలుడు గాయపడ్డాడు.దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు బాలుడిని సమావేశం జరుగుతున్న మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. 8లో






నేరస్తులకు శిక్షపడితే..

నేరస్తులకు శిక్షపడితే నేరాలు తగ్గుముఖం పడతాయని సిద్దిపేట కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. పోక్సో కేసుల్లో సాక్షులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. 8లో



ర్యాలీని జయప్రదం చేయాలి

కేంద్ర విధానాలకు నిరసనగా నిర్వహించే మజ్దూర్–కిసాన్ ర్యాలీ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు పిలుపు ఇచ్చారు. 9లో



న్యూస్‌రీల్

చిరుధాన్యాలపై అవగాహన పెంచుకోవాలి

స్త్రీ, శిశుసంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పద్మావతి



బహుమతులు అందజేస్తున్న పద్మావతి

నారాయణఖేడ్: చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకోవాలని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.పద్మావతి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శుక్రవారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మార్చి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెల్‌బేబీ షోలు, గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తూ చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. వెల్‌బేబీ షో నిర్వహించి చిన్నారులకు తన చేతులమీదుగా బహుమతులను అందజేశారు. జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నాయకులు రమేష్ చౌహాన్, ఖేడ్ ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్లు దేవకృప, జమున, ప్రమీల, మంజుల, చంద్రకళ, ఫాతిమాబేగం, పోషణ్ అభియాన్ సమన్వయకర్త నివర్తి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోంది

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతీ జిల్లాలో మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అభాసుపాలు చేస్తూ విచ్ఛిన్నకర రాజకీయాలకు తెరలేపిందన్నారు. రాహుల్ గాంధీనిపై అనర్హత వేటు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాహుల్ జోడో యాత్ర విజయవంతం కావడంతో బీజేపీ ప్రభుత్వం గడగడలాడుతోందన్నారు. రాహుల్‌కి కోర్టు 30 రోజుల సమయం ఇచ్చిన పార్లమెంట్ సెక్రటరీ నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, కున సంతోష్, మండల అధ్యక్షుడు బుచ్చి రాములు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న న్యాయవాదులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏడోసారి విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించినందుకు న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలుపుతూ న్యాయవాదుల పరిరక్షణ చట్టం కోసం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, సహాయ కార్యదర్శిగా బాల్‌రాజు, క్రీడల కార్యదర్శిగా మాణిక్యరెడ్డి తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల్లో జోష్

- వర్చువల్ ద్వారా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అధ్యక్షుడు జేపీ నడ్డా
- హాజరైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తరుణ్‌చుగ్
- బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న కార్యకర్తలు



సభలో ప్రసంగిస్తున్న బండి సంజయ్, చిత్రంలో తరుణ్ చుగ్, కిషన్ రెడ్డి, లక్ష్మణ్, మురళీధర్ రావు, రఘునందన్ రావు తదితరులు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం జాతీయ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మహిళలు బోనాలతో స్వాగతించారు. వేదిక వద్ద జేపీ నడ్డా ప్రారంభించే కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. నడ్డా ప్రారంభించగానే బండి సంజయ్‌తో పాటు వేదికపై ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జాతీయ నాయకులు మురళీధర్‌రావు, అరవింద్ మీనన్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డితో పాటు జిల్లా పదాధికారులు చప్పట్లతో స్వాగతించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బండి సంజయ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, భరతమాత చిత్ర పటానికి పూజలు చేశారు. పార్టీ కార్యాలయం ప్రారంభించగానే కార్యకర్తలు బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిధిలోని సంగారెడ్డి, పటాన్‌చెరువు, నారాయణఖేడ్, అందోల్, జహీరాబాద్ ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. జాతీయ రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరువు నియోజకవర్గానికి చెందిన ఎడ్ల రమేశ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల బృందంతో హల్‌చల్ చేశారు.



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బండి సంజయ్



హాజరైన నాయకులు, కార్యకర్తలు

చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): చదువు, క్రమశిక్షణ మంచి నడవడికతోనే సమాజంలో విద్యావంతులకు మంచి గుర్తింపు వస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ రవీంద్ర మోడల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలు పూర్తయ్యే వరకు సెల్‌ఫోన్లు, టీవీలను చూడకుండా చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ మధునాల నర్సింహులు, ఎంపీడీఓ పూజ, ప్రధానోపాధ్యాయుడు లింబాజీ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బోడపల్లి రవి, ఉపాధ్యాయులు శంకర్‌రావు, పూర్ణ, కృష్ణ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల సారాంశం ఒక్కటే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్ని మతాల సారాంశం ఒక్కటేనని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురంలో రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతీఒక్కరు సోదర భావంతో మెలగాలన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, సోయల్, పాష పాల్గొన్నారు.

నలుగురికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 25 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో నలుగురికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 19 మందికి నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

హరిదాస్‌పూర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డును అందుకుంటున్న సర్పంచ్ షఫీ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని హరిదాస్‌పూర్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల వ్యవసాయ శాఖ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా హరిదాస్‌పూర్ సర్పంచ్ షఫీ, పంచాయతీ కార్యదర్శి రోహిత్ కులకర్ణికి అవార్డును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది కేటగిరీలలో అవార్డులను ప్రకటించగా, హరిదాస్‌పూర్ చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామాల కేటగిరీలో అవార్డుకు ఎంపికైంది. హరిదాస్‌పూర్‌లో నాలుగు సంవత్సరాలుగా ఆడపిల్లల సంరక్షణకు చేపడుతున్న చర్యలతో పాటు ఆడపిల్ల పుడితే ఊరంతా సంబురాలు చేసుకుంటుండటంతో అవార్డుకు ఎంపిక చేశారని సర్పంచ్ తెలిపారు.

అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ శిక్షణకు ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని మున్సిపాలిటీ ప్రాంత నిరుద్యోగ యువతకు నిర్మాణరంగ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మెప్మా పీడీ గీత శుక్రవారం తెలిపారు. నిర్మాణ రంగానికి సంబంధించి మూడు నెలల పాటు అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ వృత్తిలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు 18 ఏళ్ల పైబడి 33 సంవత్సరాల లోపు వయసు, పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. శిక్షణ సమయంలో యూనిఫామ్, షూ, హెల్మెట్, స్టేషనరీ ఉచితంగా ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం న్యాక్ సర్టిఫికెట్ ఇస్తారని, ప్రైవేట్ సంస్థలలో ఉపాధి కల్పిస్తారని తెలిపారు. శిక్షణకు ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు తమ విద్యార్హతలు, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్, హాస్టల్ బిల్డింగ్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కార్యాలయంలో నేరుగా లేదా 96761 41583, 99497 51056 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

సంగారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బుచేంద్ర మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించి, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం తెలిపి న్యాయం చేయాలని లేనిపక్షంలో ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వెంకటేశ్, సుదర్శన్, అనిల్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



సమావేశంలో కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయం

- సకాలంలో చార్జిషీట్ దాఖలు చేయాలి
- కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేసి నిర్ణీత గడువులోగా చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్పీ రమణ కుమార్, అందోల్ శాసనసభ్యుడు చంటి క్రాంతికిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అట్రాసిటీ కేసుల పురోగతిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు వీలుగా పకడ్బందీగా దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలను సేకరించి సకాలంలో చార్జిషీట్ ఫైల్ చేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందే విధంగా చూడాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని క్రమం తప్పకుండా మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని, తద్వారా సమస్యలు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందిస్తున్న పథకాలను వినియోగించుకునేలా, ఆయా పథకాలలో లబ్ధిపొందిన లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అవగాహన కల్పించాలని విజిలెన్స్ కమిటీ సభ్యులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి 2022–23లో 28 కేసులలో బాధితులకు రూ.43.50 లక్షలు మంజూరు చేసి చెల్లించినట్లు తెలిపారు. ప్రతీనెల తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఘటనలు చోటు చేసుకున్నప్పుడు పోలీస్ శాఖ తరఫున బాధితులకు తప్పని సరిగా పూర్తి న్యాయం జరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మొత్తం 33 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తర్వాత అందోల్ శాసన సభ్యుడు మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలు అత్యాచారాలు తగ్గుముఖం పట్టాయన్నారు. దళితుల్లో చైతన్యం వచ్చిందని, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మరింత చైతన్య పరచాలని కోరారు. దళిత బంధు పథకంలో లబ్ధిదారులు తీసుకున్న యూనిట్లతో అభివృద్ధి చెందుతున్నది, లేనిది పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి అధికారి జగదీశ్, డీఎస్పీలు, ఆర్డీవోలు, డీటీడబ్ల్యూఓ ఫిరంగి, కలెక్టరేట్ సూపరింటెండెంట్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.ఇమ్మయ్య, బి.రామకృష్ణ, పి.దుర్గాప్రసాద్, ఎం.చంద్రశేఖర్, రాథోడ్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల–దుద్దెడ ట్రాక్‌పై ట్రయల్‌రన్



కొడకండ్ల-దుద్దెడ రైల్వే లైన్‌పై వచ్చిన రైలు ఇదే..

పాల్గొన్న కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ అధికారుల బృందం

గజ్వేల్/కొండపాక: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే మార్గంపై శుక్రవారం మరో ట్రయల్‌రన్ జరిగింది. ఈ లైన్‌పై గతేడాది మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా కొడకండ్ల వరకు రెండుసార్లు 41 కిలోమీటర్ల మేర కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ స్పీడ్ టెస్ట్ విజయవంతంగా పూర్తికాగా, తాజాగా కొడకండ్ల నుంచి దుద్దెడ వరకు ట్రయల్‌రన్ చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వేశాఖ కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ బాధ్యులు ప్రంజయ్‌సక్సేనా ఆధ్వర్యంలో ఈ ట్రయల్‌రన్ జరిగింది. మొత్తంగా 21కిలోమీటర్ల మేర 125 కిలోమీటర్ల వేగంతో స్పీడ్ టెస్ట్ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషన్ ఆఫ్ రైల్వేసేఫ్టీ బృందం రైల్వే ట్రాక్ నిర్మాణం, దుద్దెడ వద్ద మినీస్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 151 కిలోమీటర్ల మేర ఉన్న ఈ లైన్‌పై ఇప్పటి వరకు 62 కిలోమీటర్ల పైన మాత్రమే ట్రయల్‌రన్ పూర్తి చేశారు. త్వరలోనే సిద్దిపేట వరకు ట్రయల్‌రన్ జరిగే అవకాశాలున్నాయి. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వేశాఖ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(కన్‌స్ట్రక్షన్) నీరజ్ అగర్వాల్, హైద్రాబాద్ డివిజన్ డీఆర్‌ఎం శరత్ చంద్రాయన్ చీఫ్ ఇంజినీర్ కన్‌స్ట్రక్షన్ రవి కల్పాండేతో పాటు స్థానికంగా రైల్వేలైన్ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీర్ జనార్దన్ పాల్గొన్నారు.

ఇక పటాన్‌చెరులోనే రిజిస్ట్రేషన్లు

- ఫలించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కృషి
- కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు మరూ
- నెలలోగా నూతన భవనం ప్రారంభం
- పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరులో సబ్ రిజిస్ట్రార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్ జీఓ 30ని జారీ చేశారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రపురం మండలాలను చేరుస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో రోజురోజుకి రియల్ ఎస్టేట్ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానికంగా రిజిస్ట్రేషన్ కార్యాలయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వచ్చేదన్నారు. రోజుల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉత్పన్నమయ్యేవని గుర్తుచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఎన్నికల సభలో సీఎం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. నూతన భవనం అందుబాటులో వచ్చేవరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో..

పటాన్‌చెరు పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో నూతన కార్యాలయ భవనాన్ని నెలలో సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రధాన హామీల్లో రెండు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు రూ.70 కోట్లతో బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వరకు వంద అడుగుల రహదారిని విస్తరించడం జరిగిందన్నారు. పటాన్‌చెరు, జిన్నారంలో మున్సిఫ్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఆడిట్ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చిట్స్ సేవలు సైతం పటాన్‌చెరులోనే అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, పటాన్‌చెరు ఎంపీపీ సుష్మా, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజు, షేక్ హుస్సేన్, గోపాల్, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్ఐ రవీందర్

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎనగుర్తి ప్రభుత్వ పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలపై వారు వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ పోక్సోచట్టం, ఆన్‌లైన్ మోసాలు, కస్టమర్‌కేర్ మోసాలు, మొబైల్ ఫోన్ ఉపయోగించడంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆయన చెప్పారు. పదోతరగతి విద్యార్థులు ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. రాబోయే పరీక్షల్లో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, హరికృష్ణ, రాజిరెడ్డి, సంపత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


కాలిపోయిన పూరిల్లు

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం సంగాయిపేటలో శుక్రవారం తెల్లవారుజామున పూరిల్లు దగ్ధమైన ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల, స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పుర్రె నవరాణి పూరిల్లులో నివాసం ఉంటుంది. తెల్లవారుజామున గుడిసె వెనుక నుంచి మంటలు చెలరేగడంతో ఇది గమనించిన ఆమె కేకలు వేసుకుంటూ బయటకు వచ్చింది. కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు లేచి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే పూరిల్లు మొత్తం కాలిపోయింది. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనలో తిండి గింజలు, బట్టలు ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయన్నారు. కట్టు బట్టలే మిగిలాయని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలతో పాటు, గ్రామస్థులు కోరారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నర్సాపూర్‌రూరల్: ప్రమాదవ శాత్తు చెరువు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం ఖాజీపేట గ్రామంలో చోటు చేసుకుంది. నర్సాపూర్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట గ్రామానికి చెందిన మంగలి ప్రభాకర్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన పశువులను మేపడం కోసం గ్రామ శివారులోని తాబేలు కుంట వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో పడి ప్రభాకర్ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు జరిమానా

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని మమత హోటల్ యజమాని రోడ్డుపై చెత్త వేసినందుకు గాను శుక్రవారం మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ రూ.600 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా వేస్తామన్నారు. దుకాణాలు, ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లోనే వేయాలని ఆయన సూచించారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

- పెరిగిన కూలీ రేట్లు
- ఏప్రిల్ ఒకటి నుంచి అమలు


ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు

సిద్దిపేటరూరల్: ఉపాధిహామీ కూలీలకు రోజువారి వేతనం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీపి కబురును ఇచ్చింది. గతంలో ఉన్న కూలీ రేటుకు రూ.15 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి పెంచిన కూలి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో జిల్లాలోని 4 లక్షలకు పైగా ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరనుంది.

ఉపాధే ఆధారం

చాలా మంది ఉపాధిహామీ పనులే ఆధారంగా జీవనం సాగించే కుటుంబాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రోజువారీ కూలికి అదనంగా రూ. 15 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్లైన్లో నమోదైన పనిదినాల ఆధారంగానే చెల్లింపులు జరగనున్నాయి. కూలీల ఖాతాల్లోకి నేరుగా ఈ మొత్తాన్ని పాత పద్ధతిలోనే జమ చేయనున్నారు. ఒక కూలీ 100రోజులు పనిచేస్తే గతంలో రూ.25,700లు జమ అయ్యేవి. ప్రస్తుతం పెంచిన కూలితో వంద రోజులకు రూ.27,200లు ప్రభుత్వం చెల్లించనుంది.

వేసవి భత్యం లేమితో కొంత ఊరట

వేసవి కాలం ఉపాధి హామీ కూలీకి వెళ్లే వారికి 5 నెలల పాటుగా కొంత మొత్తం అదనపు కూలీకింద ప్రభుత్వం వేసవి భత్యంగా అందించేది. ఈ క్రమంలో గత సంవత్సరం నుంచి వేసవిభత్యం సాఫ్ట్‌వేర్ కారణంగా నిలిపేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీలకు ఒకరోజు కూలిపై అదనంగా రూ.15 పెంచడంతో కూలీలకు కొంత ఊరట లభించింది. దీంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధిహామీ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అమలు



రోజువారి కూలీకి రూ.15 కేంద్ర ప్రభుత్వం పెంచిన విషయం వాస్తవం. ఇది ఏప్రిల్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు నేరుగా ఖాతాల్లో జమ చేస్తారు. జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు కలిగి ఉన్న కూలీలు పని కోసం దరఖాస్తు చేసుకుని, పని చేస్తే నూతనంగా అందించబోయే వేతనాన్ని పొందేందుకు అవకాశం ఉంది.

–చంద్రమోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి, డీఆర్‌డీఓ

ఇంటిపై రాళ్ల దాడి చేశారని ఫిర్యాదు


రాళ్ల దాడిలో పగిలిన కిటికీ అద్దాలు

పటాన్‌చెరు టౌన్: ఇంటిపై రాళ్ల దాడి చేశారని పట్లోళ్ల సరిత పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలు పట్లోళ్ల సరిత ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... పటాన్‌చెరు పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన పట్లోళ్ల సరిత ఇంటిపై గురువారం రాత్రి కార్పొరేటర్ వర్గీయులు ఇంట్లోకి వచ్చే ప్రయత్నం చేశారని, దీంతో ప్రధాన గేట్‌తో పాటు, ఇంటికి తాళం వేశానని ఆమె చెప్పారు. తెల్ల షర్టు వేసుకున్న వ్యక్తితో పాటు మరో ఇద్దరు యువకులు ఇంటిపై రాళ్ల దాడికి పాల్పడ్డారని, ఇంటి కిటికీలతోపాటు, కారు డ్యామేజ్ అయిందన్నారు. తెల్ల షర్ట్ వేసుకున్న వ్యక్తిని స్థానికుల ద్వారా వివరాలు తెలుసుకోగా అతను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అల్లుడు సన్నీ అని తెలుసుకున్నానన్నారు. తన ఇంటిపై రాళ్ల దాడి చేసిన సన్నీతో పాటు మరో ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం బాధితురాలు పట్లోళ్ల సరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కల్వర్టును ఢీకొట్టిన గూడ్స్ వాహనం

డ్రైవర్ మృతి, నలుగురికి గాయాలు


మహ్మద్ హనీఫ్ మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కల్వర్టును గూడ్స్ వాహనం ఢీ కొట్టడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని ఖానాపూర్(బి) రోడ్డు వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ హనీఫ్(47) బొలేరో గూడ్స్ వాహనంలో నిజామాబాద్ వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఖానాపూర్(బి) రోడ్డు వద్ద కల్వర్టును ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. వాహనంలో ప్రయాణిస్తున్న అవుటి లచ్చమ్మ, రంజిత్‌నాయక్, లక్ష్మీ, కళావతి గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. మృతుడి సోదరుడు జునైద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన సాయిచైతన్య

మెదక్ మున్సిపాలిటీ: కుక్కలు దాడిచేసి బాలుణ్ని గాయపర్చిన సంఘటన శుక్రవారం మెదక్ పట్టణంలోని జంబికుంట వీధిలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జంబికుంట వీధికి చెందిన గూడ దివ్య శ్రీనివాస్‌ల ఆరేళ్ల కుమారుడు సాయిచైతన్య ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధికుక్కలు ఒక్కసారిగా బాలునిపై దాడిచేసి గాయపర్చాయి. ఆగ్రహించిన తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన బాలుణ్ని మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి తీసుకొచ్చారు. కుక్కలు, కోతులతో ప్రజల ప్రాణాలు పోతున్న పట్టించుకోరా? అంటూ మున్సిపల్ చైర్మన్, కమిషనర్లను నిలదీశారు. వెంటనే స్పందించిన అధికారులు కోతులు, కుక్కల బారినుంచి కాపాడే విధంగా తగిన చర్యలు చేపట్టాలని వారు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆ బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ రాగి వనజ మాట్లాడుతూ కోతులు, వీధి కుక్కల నివారణా చర్యలు చేపట్టాలని గతంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వల్లే చిన్నారులు సైతం కుక్కల దాడిలో గాయపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


మృతుడు రాజు (ఫైల్)

సిద్దిపేటరూరల్: కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన పుల్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పుల్లూరు గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజు(43) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు చూపించిన నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో శుక్రవారం ఉదయం ఇంటి వెనకాల ఉన్న షెడ్డులో ఉరి వేసుకున్నాడు. కుమారుడు లోకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి


సిద్ధిరాములు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని జయపురం, లక్ష్మీనగర్ శివారులో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గాంధారిపల్లికి చెందిన మిద్దెల సిద్ధిరాములు(26) కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. భార్య మౌనిక కొన్ని రోజుల క్రితం గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో లక్ష్మీనగర్, జయనగర్ రోడ్డు పక్కన పడిపోయాడు. అటుగా వెళుతున్న స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. మృతుడి బంధువు పోచమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): అనుమానా స్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వడియారం రుద్రవోని కుంటలో శుక్రవారం వెలుగు చూసింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అనంతసాగర్ గ్రామానికి చెందిన చిక్కుడు నరేష్(25) ఈ నెల28 నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయమై అతడి మామ బోనగిరి రాజు చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ క్రమంలో అనంతసాగర్ సమీపంలోని రుద్రవోని కుంటలో ఒక మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గ్రామస్తులు కుళ్లిన శవాన్ని గుర్తుపట్టలేకపోయారు. మృతుడి భార్య సింధూజ చేతికున్న నల్లదారంతో పాటు ఉంగరం ఆధారంగా తన భర్త నరేశ్‌గా గుర్తించింది. నరేశ్ మృతిపై అనుమానాలున్నాయని అతడిని కావాలనే ఎవరో హత్య చేశారని మామ రాజుతో పాటు మృతుడి బంధువులు ఆరోపించారు. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

వేధింపుల కేసులో 20ఏళ్ల జైలు

- పొక్సో కింద యువకుడికి శిక్ష
- రూ. 10వేల జరిమానా

జగదేవ్‌పూర్(గజ్వేల్): వేధింపునకు పాల్పడిన నేరానికి ఓ యువకుడికి అడిషనల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి జైలు శిక్ష విధించింది. గజ్వేల్ ఏసీపీ రమేష్ శుక్రవారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రమేశ్(28) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల పాపతో అసభ్యకరంగా ప్రవర్తించి, లైగింక వేధింపులకు గురిచేశాడు. దీంతో పాప కుటుంబీకులు 2021, నవంబర్ 24న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ పరమేశ్వర్ కేసు నమోదు చేయగా ఏసీపీ రమేశ్ కేసు పరిశోధన ప్రారంభించి నేరస్థుడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా అడిషనల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి ఇరువురి వాదనలు విన్నారు. నేరం రుజువైనందునా నిందితుడు రమేష్‌కు 20 సంవత్సరాల జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం, గజ్వేల్ ఏసీపీ రమేశ్, ఎస్ఐ పరమేశ్వర్, గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, తొగుట సీఐ కమలాకర్, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణమూర్తి, కానిస్టేబుల్ బాపురెడ్డి, లావణ్య విట్టల్, కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ స్వామిదాస్, హెడ్ కానిస్టేబుల్ రాజమల్లయ్యను సీపీ శ్వేత అభినందించారు.

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి...


దిడ్డి బేతయ్య మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): శ్రీరామ నవమి సందర్భంగా బండ్లు కడిగేందుకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం రాంరెడ్డిపేట గ్రామానికి చెందిన దిడ్డి పోశెట్టి లచ్చవ్వ దంపతుల కుమారుడు దిడ్డి బేతయ్య(24) మరో యువకుడు చాకలి సాయిలుతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో బండ్లు శుభ్రం చేసేందుకు వెళ్లారు. ప్రాజెక్టు మధ్యలో జేసీబీ గోతులు ఉండడంతో బండ్లు కడుగుతున్న దిడ్డి బేతయ్య, చాకలి సాయిలు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు చాకలి సాయిలును నీటిలో నుంచి బయటకు తీశారు. దిడ్డి బేతయ్యను ఎంత వెతికినా ఆచుకీ లభించలేదు. మత్స్యకారులు చేపలు పట్టే వలలతో మృతదేహాన్ని శుక్రవారం మధ్యాహ్నం ఒడ్డుకు చేర్చారు. బేతయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇక్కడ జరగాల్సిన జాతర ఉత్సవాలను వాయిదవేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

కర్ణాటక ప్రాజెక్టులో దూకి ఎంఆర్‌ఎఫ్ ఉద్యోగి ఆత్మహత్య


సాయికుమార్(ఫైల్)

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన ఎంఆర్‌ఎఫ్ ఉద్యోగి మంగలి సాయికుమార్(22) కర్ణాటకలోని ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం....సాయికుమార్ సదాశివపేటలోని ఎంఆర్‌ఎఫ్ ప్రొడక్షన్ ప్లాంట్‌లో పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి నానమ్మ భారతమ్మకు ఫోన్ చేశాడు. తాను గొట్టంకోట అడవికి వెళుతున్నట్టుగా, ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోందని చెప్పాడన్నారు. ఎందుకు అలా మాట్లాడుతున్నావని ఆమె సాయికుమార్‌ను ప్రశ్నించింది. అనంతరం ఫోన్ చేసినా అతను ఎత్తలేదు. దీంతో కుటుంబ సభ్యులు చించోళి పోలీసులను సంప్రదించారు. వారు ఫోన్ సిగ్నల్ ఆధారంగా చంద్రంపల్లి ప్రాజెక్టు వద్ద గాలించారు. అక్కడ అతని ఫోన్, చెప్పులు లభ్యమయ్యాయి. కానీ సాయికుమార్ ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానంతో ప్రాజెక్టులో గాలించారు. అయినప్పటికీ అతని జాడ కనిపించలేదు. శుక్రవారం సాయంత్రం శవం కనిపించడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు చించోళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని మక్కరాజీపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. సర్పంచ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాషబోయిన మల్లేశ్ తన వ్యవసాయ పొలం వద్ద ఎద్దును మేపడానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో రూ.50వేలు నష్టం వాటిల్లిందని మల్లేశ్ తెలిపారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

జోగిపేట(అందోల్): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరియని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డీబీ నాగభూషణం అన్నారు. శుక్రవారం జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగి బాగమ్మ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపాల్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డికి తరలిన బీజేపీ నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి శుక్రవారం స్థానిక నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బలరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఒక శక్తివంతంగా తయారవుతుందన్నారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

పరీక్షల్లో ఉత్తమ గ్రేడ్లు సాధించాలి

జోగిపేట(అందోల్): పదో పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ గ్రేడ్లు సాధించాలని అందోలు ఎంపీడీఓ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెన్నెల యువజన సంఘం, సర్పంచ్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో డాకూర్ సర్పంచ్ కళాలి, ఎంపీటీసీ ప్రమీల, ఉప సర్పంచ్ అజయ్, కార్యదర్శి వినీత్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మకు బోనాలు


బోనాల ఊరేగింపులో జయశ్రీరెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం పోచమ్మకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పోచమ్మతల్లికి బోనాలను సమర్పించారు. ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి బోనాల ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్ల నర్సమ్మ, ఉప సర్పంచ్ సత్యనారాయణ, కురుమసంఘం బాధ్యులు మల్‌గొండతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 9 నెలల జైలు

సిద్దిపేటకమాన్: దొంగతనం కేసులో నేరస్తునికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట అర్బన్ లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల రవీందర్ రెడ్డి 2019 ఏప్రిల్ 22న పని నిమిత్తం సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఇంటికొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రూ.40వేలు దొంగిలించినట్లు గుర్తించాడు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ సాంబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేడ్చల్ జిల్లా దండేపల్లి మండలం , గూడెం గ్రామానికి చెందిన తాండ్ర ప్రదీప్‌ను దొంగతనం చేసినట్లుగా గుర్తించి విచారణ అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి కేసు కోర్టులో విచారణ, వాదనలు విన్న న్యాయమూర్తి శ్రావణి నిందితునికి రూ.500 జరిమానాతో పాటు 9 నెలల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రూపారెడ్డి, కానిస్టేబుల్ స్వామి, అమరేందర్, స్వామిదాస్, సీఐ రవికుమార్ సీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి ఆత్మహత్య

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తాగిన మైకంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రంలోని కుంచవరం గ్రామానికి చెందిన జి.శ్రీకాంత్(24) జహీరాబాద్‌లోని ఓ దాభాలో పనిచేస్తున్నాడు. మోటారు సైకిల్‌పై వెళుతూ తాగిన మైకంలో గురువారం రాత్రి రాంనగర్ వద్ద ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో ప్రమాదంలో శ్రీకాంత్‌తో పాటు ఎదుటి వ్యక్తి కూడా గాయపడ్డారు. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న శ్రీకాంత్ రాత్రి 11 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లాడు. గతేడాది పని చేసిన జహీరాబాద్‌లోని వాటర్ ప్లాంట్‌కు వెళ్లాడు. అక్కడ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘108’లో మహిళ ప్రసవం


శిశువుని మాధవి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్యామ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన మాధవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో 108 వాహనంలో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొస్తుండగా లక్డారం గ్రామ శివారులోకి రాగానే మాధవికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ శ్యామ్ 108 వాహనంలోనే ప్రసవం చేశారు. ఆమె మగ శిశువుకి జన్మనిచ్చింది. తల్లీబిడ్డను పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లినట్లు శ్యామ్ తెలిపారు. మాధవి కుటుంబ సభ్యులు ఈఎంటీ శ్యామ్‌తో పాటు పైలెట్ ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేరస్తులకు శిక్ష పడితే.. నేరాలు తగ్గుముఖం

సిద్దిపేట సీపీ శ్వేత


మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: నేరస్తులకు ఆయా కేసుల్లో శిక్షలు పడితే నేరాలు తగ్గి ప్రజల్లో భద్రతా భావం పెరుగుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏసీపీలు, సర్కిల్ సీఐలతో సీపీ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పోక్సో కేసుల్లో సంబంధిత సాక్షులకు భరోసా సెంటర్లో అధికారులు, సిబ్బంది కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆమె సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ట్రయల్ సమయంలో సంబంధిత ఇన్వెస్టిగేషన్ అధికారులు తప్పకుండా మానిటర్ చేయాలన్నారు. కోర్టు వారిగా కేలండర్ తయారు చేయాలని తెలిపారు. పెండింగ్‌లోని పెట్టి కేసులను డిస్పోజల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐలు బిక్షపతి, రవికుమార్, భానుప్రకాష్, జానకీరామ్‌రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల మెసేజ్‌లు ఓపెన్ చేయొద్దు

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు ఓపెన్ చేయొద్దని సీపీ శ్వేత సూచించారు. సిద్దిపేట పట్టణంలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి నుంచి మర్చంట్ ప్లేస్‌కి ఓ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను సదరు బాధితునికి ఫోన్ చేసి ఓపెన్ చేయాలని తెలిపాడు. అది నమ్మిన అతను మెసేజ్‌ను ఓపెన్ చేశాడు. వెంటనే అతని బ్యాంకుఖాతా నుంచి రూ.25వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఈ విషయంలో బాధితుడు సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.